# తీర్పు

బిడ్డఅపట్ల తండ్రికి బాధ్యత వుండాలి అనేది మన సిద్ధాంతం అయితే బిడ్డలకూ తండ్రిపట్ల అదే బాధ్యత వుండాలి.

—జయప్రద

"లోకేష్ ఒంటరి తండ్రిని వదిలేసి తనదారి తను చూసుకున్నాడు."

ఈ వార్త మా స్నేహబృందానికి తెలిసి పదినిముషాలయింది. "పాపం! ఈ వయసులో లోకేష్ తండ్రి ఒంటరివాడై పోయాడు" అని మాలో ఒకరిద్దరన్నా మిగతావాళ్ళు దాన్ని సపోర్ట్ చేయలేదు.

లోకేష్ ప్రేమించిన పిల్ల అన్య కులస్థురాలే కావచ్చు. కానీ కనుముక్కు తీరు చూడడానికి బాగానే వుంటుంది. గుణవంతురాలు. రేప్రొద్దున మంచాన కంచాన పడితే మావకు సేవలు చేసే అమ్మాయేకానీ నా

కెందుకొచ్చిన తద్దినం అనుకునే అమ్మాయికాదు. మరి ఈయన అభ్యంతర మేమిటట? ఎదిగిన బిడ్డమీద ఈయన జులుం ఏమిటట?

ఇది మధుసూదన్, దేవానంద ఉద్దేశం.

"కాదన్నాడే అనుకో లోకేష్. జబ్బుతండ్రిని, ముసలితండ్రిని వదిలేసి వెళ్ళిపోవడం—ఏమో నా కన్యాయమనే అన్పిస్తోంది" అనకుండా వుండలేక పోయాను.

"అంటే నీ ఉద్దేశ్యం--ఆ అమ్మాయికి అన్యాయం చేయాలంటావు?"

కాస్త నీళ్ళు నమిలాను నేను.

నిజమే. మనసు మాట జారేసినప్పుడు, తండ్రి కాదన్నప్పుడు ఎవరో ఒకర్ని అన్యాయం చేయాల్సిందే కదా.

తండ్రిని కన్విన్స్ చేసుకో నుండొచ్చు. ఇంతకాలంనుంచి పెద్ద చేసి తనమీదే ప్రాణాలు పెట్టుకునీ—"

"ట్రాష్! ఊరుకుందూ ఆ ముసలాడు ఒప్పుకుంటాడా?"

నవ్వొచ్చింది నాకు లోకేష్ తండ్రికి యాభై అయిదేళ్ళుంటాయి. మాకంతా యాభై దగ్గరే. అతను ముసలాడు మేము పడుసోళ్ళం.

మొత్తానికి అందరం కలిసి లోకేష్ మంచిపని చేసాడనే నిర్ధారణ చేసుకున్నాం. కానీ ఒక్కటి ఆలోచించలేదు. మేము ఇదే పని మా పిల్లల్లో ఒక్కరు చేస్తే ఆ రియాక్షన్ మాలో ఎలా వుంటుంది?

ఈనాటి ఈ తాజావార్త విన్నప్పటినుండి దానిమీద ఈ రెండు గంటలుగా జరుగుతున్న డిస్కషన్ వెనగ్గా నాకు నిన్నటి తాజావార్త నిన్నటి డిస్కషన్ వద్దన్నా గుర్తొస్తూ వుంది.

నిన్న మా చిన్నమ్మాయి నా దగ్గరకొచ్చి-

"నాన్నా! మీ రొక్కసారి నా ఫ్రెండ్ మధూలిక ఇంటికి రావాలి" అని పిలిస్తే ఆశ్చర్యపోయాను. మధూలికతో గానీ, ఆమె తండ్రితో గానీ నాకు పరిచయం లేదు.

"అదే నాన్నా! పాపం మధూ నాన్న ఆ ముసలామె వుంది చూడు రాధమ్మ ఆమెను....ఆమెను"

"ఏమిటమ్మా?"

"అమెను, అమెనిప్పుడు పెళ్ళిచేసుకుంటాడట ఆయన"

నాకే ఆశ్చర్యం! నేనే తృళ్ళి పడ్డాను ఓ క్షణం.

ఆ తర్వాత ఆలోచిస్తే అన్పించింది. అందులో తప్పేముంది? పెళ్ళి లోకసహజం అయినప్పుడు ఆయన చేసేదాంట్లో తప్పేముంది? అదేమాట నా కూతురితో అందామనుకున్నాను కానీ అనలేదు. ఆ అమ్మాయి కళ్ళు నా సపోర్ట్ కొరకు ఎదురు చూస్తున్నాయి. మౌనంగా నా కూతురి వెంట మధూలిక ఇంటి కెళ్ళాను.

ఆ పెద్ద హాలులో చెరో మూల నిల్చొనున్నారు. మధూలిక, ఆమె అన్న శేషసాయి. మధూలిక తండ్రి డాక్టర్ వేదమూర్తి. సోఫాలో కూర్చునున్నాడు. అతనిముఖం వాడిపోయుంది. కానీ అతని కళ్ళల్లో శిలాకసత్వం.

"మధూ! రాధ అంటీ అంటే నీ కిష్టమే కదమ్మా! ఆమె కంపెనీ నీవు ఎంజాయ్ చేస్తావుకదమ్మా"

"అది వేరు....మా అమ్మ ప్లేస్...."

తన తల్లి స్థానంలో మరో మనిషికి చోటివ్వడం ఆ పిల్లకు పూర్తిగా నచ్చని భావం. ఆ అసంపూర్ణ వాక్యంలో స్పష్టంగా వుంది.

నిజమే. తన తల్లి తిరగాడిన ఈ ఇంట్లో మరో కొత్త మనిషిని భరించడం కష్టమే. అలా అని ఈ ఇంటికి అల్లుడు రాకుండా వుంటాడా? ఈ ఇంట్లో సోఫాలమీద కూర్చోకుండా వుంటాడా? తన తల్లి వాడిని కప్పు సాసర్లలో కాఫీ తాగకుండా వుంటాడా?

అదే అడగాలనుకున్నాను కానీ నన్ను నా కూతురు తీసుకొచ్చింది అందుక్కాదు. అందుకే మౌనంగా మిగిలిపోయాను. ఓ పరాయి వ్యక్తి ఆ సమయంలో తమ మధ్యకొచ్చినా తన కూతురుగానీ, కొడుకుగానీ సంభాషణ ఆపు చేయకపోవడంతో వాళ్ళే సపోర్ట్ కొరకు తనను పిల్చుకున్నారని అనుకున్నాడేమో నన్ను కూర్చోమని సోఫా చూపి ఆయన సంభాషణ కొనసాగించారు.

అయినా ఈ వయసులో మీకు పెళ్ళేమిటి" కొడుకు ఓ మూల

నిలబడి భయంగా, కోపంగా వేసిన ప్రశ్నకు వేదమూర్తి మనసులో ఏమి తడబడ్డాడో పైకి మాత్రం-

"ఈ వయసులో తోడు కావాలనిపిస్తోందిరా" అన్నాడు చెదరని స్పష్టతతో. సాయి వెంటనే మరో ప్రశ్న వేయలేదు. అతనికి ఈ పరిస్థితి డెలికేట్‌గానే వుంది.

నేను నా కూతురితో ఆ హాల్‌లో ఎంటరవగానే 'కూర్చోమని' మర్యాద చేసిన తండ్రి కూతురు ఆ తర్వాత మా విషయమే పట్టనట్టుగా తమ గోలలో వున్నారు. ఈ ప్రపంచంలో ఎవరు గోడు వాళ్ళది.

మధూలిక స్త్రీ సహజమైన సిగ్గును, బిడియాన్ని ప్రక్కకు నెట్టి అంది–"రేపొద్దున నాకు పెళ్ళెలా అవుతుంది నాన్నా"

నాకు ఆ పిల్ల ప్రశ్నలు నవ్వొస్తున్నాయి.

ఈనాడు తోడులేని తండ్రి తోడుకు వెతుక్కుంటే కాదంటున్న ఆ పిల్ల ముందు ముందు తనకు తోడు దొరకదేమోనని భయపడుతోంది.

"రాధా నేను కల్సినీ పెళ్ళి చేస్తామమ్మా"

ఆ పిల్లముఖం చిట్లించింది. రాధ అనే వ్యక్తి ప్రసక్తే తన కిష్టం లేదన్నట్టుగా ముఖం చిట్లించి పూర్కోలేదు.

"ఆమేమిటి నాకు పెళ్ళిచేసేది?" అనేసింది. ఇలాటి డెలికేట్ విషయాలో మగవాళ్ళకంటే ఆడవాళ్ళే ఎక్కువ ధైర్యం చేయగలరేమో! ఎదుటి వ్యక్తి మనసుల్ని నిస్సంకోచంగా పగలకొట్టగలరేమో అన్పించింది నాకు.

"మీ అమ్మ బ్రతికుంటే నీకు పెళ్ళి చేయదా మధూ! నేను రాధను పెళ్ళిచేసుకుంటే నీకు అమ్మే కదమ్మా!"

"అమ్మా!.... ఈ కొత్త మనిషి నాకమ్మా!"

"ఎవరయినా జీవితంలోకి ప్రవేశించక ముందు కొత్త మనుష్యులేనమ్మా. మీ అమ్మ ఆ రోజు నాకు కొత్తమనిషి కాదూ! రేపీ ఇంటికొచ్చే అల్లుడు నాకు కొత్తమనిషి కాడా? అంతమాత్రాన నాకు అల్లుడు కాక పోతాడా? ఈ ఇంట్లో మనిషి కాకపోతాడా ?

మధూకి కొన్ని నిముషాల ఏం మాట్లాడాలో తోచలేదుకాబోలు విసురుగా తల తిప్పుకు నిల్చుంది.

"అయినా మీరు చేయబోయే పని నాకు నచ్చలేదు నాన్నా" సాయి నోరు విప్పాడు మరొక్కసారి.

"నీకు నచ్చలేదబ్బాయీ! నీకు నచ్చలేదని నీ తండ్రి ఈ రోజు రాధమ్మ చెయ్యి వదిలేస్తాడనుకో. రేపు ఆయనకు దురదృష్టవశాత్తూ కాలూచెయ్యీ పడిపోయిందనుకో నీ చేత్తో ఆయన నోట్లో అన్నం పెడతావా? బాత్‌రూమ్‌కి తీసుకెళ్ళి మనస్ఫూర్తిగా స్నానం చేయిస్తావా? మలమూత్రాలు శుభ్రం చేస్తావా? రాధమ్మలా చెప్పు చేస్తావా?"

అడగాలనుకున్నాను. నిలదీసి అడగాలనుకున్నాను. అడగాలనుకుని నా కూతురి కళ్ళల్లోకి చూస్తే అవి 'ఇందుకా నిన్ను తీసుకొచ్చింది నేను' అన్నట్లు చూస్తున్నట్లనిపించాయి. స్వతహాగా పిరికివాణ్నయిన నేను నాలుగుసార్లు మనసులో మననం చేసుకొందే పైకి అనలేని స్థితి కుణ్ని. నా స్వర శబ్దం పెదాలు దాటలేదు.

"నువ్వు ఇవ్వలేని నిజమైన తోడు నీ తండ్రికి ఎవరో ఇస్తానంటే వద్దంటావేమిరా పిచ్చి సన్నాసీ" అని మనసులో మాత్రం అనుకుని ఊరుకున్నాను.

"సాయీ! నేను చేయబోయే పనివల్ల మీకేమీ నష్టం రాదురా. ఈ వయసులో మేము కోరుకునేది ఒకరితోడు ఒకరితో గానీ ఈ ఆస్తులు కాదు. ఇవన్నీ మీవే-అలా అని వ్రాయమన్నా వ్రాసిస్తాను."

అతన్ని చూస్తే నాకు జాలేసింది. అతని కన్నపిల్లలు వీళ్ల- అతను పెంచిన శరీరాలు వీళ్ళవి-అతను సంపాదించిన ఆస్తులు ఇవి. అయినా అతను వాళ్ళను అర్థిస్తున్నాడు. 'ఇది నా ఇష్టం. మీ ఇష్టమయితే వుండండి లేకపోతే మీ ఏడుపు మీరేడవండి' అనలేక పోతున్నాడు ఎందుకని? అతను వాళ్ళకి శరీరరూపాలే కాదు-తన సర్వ ప్రేమను ఇచ్చాడు. ఆ ప్రేమను చంపుకోలేక అల్లాడిపోతున్నాడు. ఎంతటి మూర్ఖులీ బిడ్డలు. ఎంత స్వార్థపరులు వీళ్ళు. వీళ్ళకొరకు ఎందుకు మాకీ తాపత్రయం? నా కూతురు మనసు బాధ పడ్తుందని స్వతంత్రించి నా అభిప్రాయాన్ని నేను చెప్పుకోలేని ఈ పాశాలెందుకు?

సాయి మాట్లాడలేదు. అతనికి తన తండ్రితో ఇలాటి జుగుప్సాకరమైన టాపిక్ మీద చర్చ జరపాలని లేదు-తండ్రి మనసు మార్చుకుని రాధమ్మతో పెళ్ళి ప్రస్తావన ఆపేసుకుంటే బాగుణ్నని వుంది అతనికి.

మూర్తి నా వైపు తిరిగాడు. నా రాకను అందులో అంతరార్థాన్ని అర్థం చేసుకున్నవాడిలా అడిగాడు.

"నా కూతురు తరఫున మీరేమైనా మాట్లాడదలుచుకుంటున్నారా?"

నేను తడబడ్డాను.

"ఏదయినా మాట్లాడదల్చుకుంటే మీ తరఫునే మాట్లాడాలని వుంది" అని చెప్పాలనిపించింది. నిస్సహాయంగా నిల్చిపోయిన అతని భుజం తట్టి "భాయీ! నువ్వు ముందుకు నడువు. రాధమ్మ చెయ్యి పట్టుకుని నడువు నీ వెనుక నేనున్నాను" అనాలని వుంది

యాభయ్ ఏళ్ళ వయసులో పెళ్ళి కొరకు కొడుకుని, కూతుర్ని ప్రాధేయపడుతూ గిల్టీగా ఫీల్ అవుతున్న అతనికి "నువ్వు చేసేది తప్పు లేదు ఇది లోక సహజం. అవకాశాన్ని వదులుకోవడమే మూర్ఖత్వమవు

తుంది. ఓ పసిపిల్ల మెడలో మూడు ముళ్ళువేస్తే అన్యాయమవుతుంది. నువ్వు భేషయిన పని చేస్తున్నావు" అని అభయమీయాలని వుంది.

నేను నా వాళ్ళ మనసు నొప్పించలేని వెధవను· అందుకే....

"లేదు....లేదు....ఏమీలేదు" అని నోరు చప్పరించి ఊరుకున్నాను.

"ఏమీ లేక పోవడమేమిటి. నువ్వొచ్చిందెందుకు?" అన్నట్టు మోచేత్తో పొడిచింది నా ఆఖరి కూతురు.

"ఉండు అప్పుడేనా అవకాశం రానీ" అన్నట్టు ఆ పిల్ల వైపు చూసాను. ఎస్కేపిస్ట్ చూసే చూపది.

"ఈ ఇంట్లో మీకిప్పుడేం తక్కువయిందని, మీకేం జరగడం లేదని" తండ్రి చూపులో వేడిని భరించలేనిదానిలా తలవాల్చేసుకుంది మధూలిక.

అతనేం మాట్లాడలేదు. ఏం మాట్లాడతాడు పాపం. తన కూతురు 'మేమివ్వలేంది అ రాధమ్మ మీకేం ఇస్తుంది?' అని అడుగుతుంటే పెళ్ళి కాని కూతురికి అతనేం చెపుతాడు. రేప్రొద్దున నీ మెడలో మూడు ముళ్ళు వేయబోయే నా అల్లుడు నీకేమి ఆనందం ఇస్తాడో, నీకేమి తోడునిస్తాడో, నీకెంత ధైర్యాన్నిస్తాడో, జీవితంమీద ఎంత భరోసానిస్తాడో, ఎంత ఓదార్పునిస్తాడో, ఎంత మనశ్శాంతి నిస్తాడో, ఎంత మనోధైర్యాన్నిస్తాడో అది....అది నాకు రాధమ్మ ఇస్తుందమ్మా" అని ఎలా చెపుతాడు అసలు చెప్పాలా ఎదిగిన ఆడపిల్లకు జీవిత భాగస్వామి పిల్లలకు మించి, తల్లిదండ్రులకు మించి ఏమిస్తారో తేలీదా?

"వాడీతో సినిమాకా? బోర్ ఫ్రెండ్స్‌తో పోతాను" అనే పిల్లల జనరేషన్ ఇది. సినిమాహాల్‌లో తండ్రి ప్రక్కన కూర్చోడానికి సిగ్గుపడే పిల్లలు మీరు. భర్త ప్రక్కన సినిమాహాల్లో కూర్చోడానికి గర్వంగా భావించే భార్య రాధమ్మ.

"మధూ! మీ నాన్న ఏ ఎమర్జన్సీకేసుకో హాస్పిటల్ కెళ్ళి అర్ధ రాత్రికి ఇంటికి తిరిగొస్తే తలుపు తీయడానికే విసుక్కునే మీరు నాలుగు కబుర్లు చెప్పి ఆయన సేద తీర్చలేని మీరు, ఆయన ఎదురుగా కూర్చుని కొసరి వడ్డించి తినిపించడానికి ఆసక్తి చూపలేని మీరు, నిద్రపట్టక పడకమీద పొర్లాడుతున్న తండ్రిని చూచి నిద్ర చెడగొడ్తున్నారని విసుక్కునే మీరు—మీకు పోలికేమిటమ్మా రాధమ్మతో అది అనాలను కున్నాను కానీ అనలేదు. కానీ నేను అనదల్చుకున్న భావాన్ని ఆయన బయట పెట్టారు.

"ఈ ఇంట్లో ఏమీ జరగడంలేదు అని కదూ మధూ నువ్వంది గవు?"

ఏమీ జరగడం లేదని నేనెలా చెప్తానమ్మా. "నేనొచ్చేసరికి గీజ ర్‌లో నీళ్ళు వేడిగానే వుంటాయి. కొద్దిగా చల్లగా వున్నా నాయరు వడ్డించి వెళ్ళిన కూరలు అన్నం డైనింగ్ టేబిల్ మీద సిద్ధంగానే వుంటుంది నాలుగురోజులకో బెడ్‌షీటు నీట్‌గా నా పడక మీదుంటుంది. వార్డ్ రోబ్‌లో నా షర్ట్స్, ప్యాంట్స్ ఎప్పటికప్పుడు ఐరన్ చేసుంటాయి. కానీ....కానీ మధూ నాకింటి కొచ్చేసరికి ఏవిటో ఇల్లు శూన్యంగా వుంటోందమ్మా."

"శూన్యంగా అన్పిస్తుందా? మేమంతా ఏమయ్యాము?" ముఖం చిట్లించిందా పిల్ల తండ్రి జవాబుకు కాస్త అఫెండయినట్లుంది.

కూతురు చిన్నబుచ్చుకున్నందుకు అతను బాధపడినట్లున్నాడు.

"అది కాదమ్మా మీరంతా లేరని కాదు కానీ....కానీ నేనింటి కొచ్చేసరికి నువ్వూ సాయి సినిమా కెళ్ళంటారనుకో-నాకు ఇంటికెందు కొచ్చానా? ఇంకా స్నేహ అక్కడే కూర్చుంటే ఇంకో నలుగురు పేషెంట్లు నాకు కాలక్షేపం అయ్యేవారు కదా అన్పిస్తుంది."

"అదేమిటి నాన్నా! మీరు త్వరగా వచ్చేరోజు చెప్తే కాలేజీ నుండి వచ్చాక మేక్కడికి పోకుండా ఆగిపోదుము కదా!" తండ్రి మెత్తబడ

టంతో అతన్ని మార్చుకోవాలనే తపనతో మధూలిక తండ్రికి తోడు వుంటాననే హామీ ఇచ్చింది.

అతను ఇక్కడ కొద్దిగా తడబడ్డాడు.

"నువ్వు వుండవని కాదమ్మా. నాకెప్పుడు ఒ.పి. త్వరగా అవుతుందో ఎలా తెలుస్తుంది. నాకు ఏ రోజు పేషెంట్లు తక్కువగా వుంటే ఆ రోజు ముందు వస్తాను."

అతని మనసులో జవాబు వేరే.

ఏ మనిషికయినా తన మనిషి తన కొరకు ఎదురు చూడాలని-ఎదురువచ్చి పలకరించాలని వుంటుంది. కానీ-నువ్వు నాకోసం ఎదురు చూడు అని చెప్పాలని వుండదు. భార్యతో అయితే మనసు విప్పి 'నా కోసం వెయిట్ చెయ్యి' అని చెప్పగలడు గానీ పిల్లలు తన వాళ్ళే అయినా పిల్లలమీద తల్లిదండ్రులకు ప్రేమ ఎంత చిక్కగా వున్నా వాళ్ళ నర్థించడానికి సంకోచపడ్తాడు.

'చిట్టి తల్లీ! నువ్వీరోజు నాకోసం ఎదురు చూస్తావ్' మాటిచ్చిన దానికన్నా ఎదురు చూస్తావు నాకు తెలుసు. కానీ నీ పెళ్ళయిపోయాక ఇన్ని వైభోగాలు నీకీ ఇంట్లో జరుగుతున్నా మరో కొత్త తోడును వెతుక్కుని అతని చిటికెన వ్రేలు పట్టుకుని అతనితో యీ యింటి గడప దాటాక నా కొరకు ఎవరు ఎదురు చూస్తారమ్మా, నాకు నా జీవితాంతం నిండు మనసుతో నా రాక కొరకు నా ప్రజెన్స్ కొరకు ఎదురు చూసే మనిషి కావాలమ్మా" అని చెప్పలేకపోయాడతను.

"ఇన్ని మాటలెందుకు డాడీ ఈ ఇంట్లో మా వల్ల ఎందుకో బాధ పడినట్లున్నారు. ఇక మీ మనసుకు ఎలాటి బాధా కలగనీకుండా మేమిద్దరం చూసుకుంటాం" లోకం నవ్విపోయే ఈ పని మాత్రం చేయకండి మీ మనసు మార్చుకోండి. శేషశాయి ఒకడుగు ముందుకువేసి అన్నాడు

ఈ కొద్ది నిముషాలుగా అతనీ నాలుగుముక్కలు చెప్పడానికి మనసులోనే రిహార్సల్ వేసుకున్నట్టున్నాడు.

డాక్టర్ మూర్తి ఏమీ మాట్లాడలేదు. కానీ నా గొంతులో మాటల్ని బయటకు కక్కేయాలనే నాచియేటింగ్ సెన్సేషన్ నన్ను నిలవనీయటం లేదు.

"ఒరే నాయనా! నువ్వీ మాటలు మనస్ఫూర్తిగానే అన్నావో, నాన్న మనసు మార్చడానికే అన్నావోగానీ చిట్టితండ్రీ రేప్పొద్దున నీకు పెళ్ళయితే నీ జీవితంలోకి నీ భాగస్వామి ప్రవేశిస్తే ఆ ప్రేమలో ఆ మైకంలో, ఆ స్వార్థంలో ఈ మాటలు గుర్తుంటాయా? నీకు అప్పుడీ డైలాగు మారిపోతుందిరా పిచ్చి సన్నాసి. ఎందుకాయన్ని భ్రమలోకి త్రోసి ఆయన జీవితాన్ని సమాధి చేస్తావ్?"

నా గొంతులో భాషాభావం వాంతి కాలేదు.

ఎందుకు చెప్పడం? ఈ వయసులో ఈ వేదాంతం అరగదు. వాడికి మరలా వాళ్ళ నాన్న వయసు వచ్చినప్పుడు తప్ప వాడికీ బాధ అర్థంకాదు. ఆశీర్వదించ కూడదుగానీ, భార్యా వియోగం అనుభవించిన వాడికే ఆ విలువ, ఆ బాధ, ఆ శూన్యం అర్థమయ్యేది.

ఓ గంట తర్వాత రెండు వైపులనుండి అర్థింపులు పూర్తయినట్టున్నాయి. కొడుకు బెదిరింపులో కొచ్చాడు.

"మీరు ఆమెను పెళ్ళి చేసుకునేపనయితే నేనీ ఇంట్లో వుండను."

డాక్టర్ మూర్తి కొడుకు వైపు చూశాడు. తదేకంగా చూసాడు. తర్వాత దృఢంగా నిర్ణయించుకున్నవాడిలా నోరు విప్పాడు.

"అయితే మీ చెల్లెలు మాటేమిటి?"

"నేనూ మా అన్నతోనే వెళతాను.

"ఆల్‌రైట్. మీరీమాట ఈనాడేకాదు ఏనాడయినా నాలో మన స్తాపం వచ్చినప్పుడు అంటారు. కానీ నాకు తెలుసు రాధ నేనెంత తప్పు చేసినా నన్ను వదిలి వెళ్ళదు. వెల్ మీరెళ్ళక్కరలేదు· ఈ ఇంటిని, ఈ ఇంట్లోని వస్తువులను, నా గుండెల్లో మీ పట్లప్రేమని మీకే వదలి వెళు తున్నాను. నేను రాధను మాత్రం తీసుకెళుతున్నాను. నన్ను క్షమించే శక్తి మీకుంటే, మీరెప్పుడయినా రావాలనుకుంటే మా చిన్న ఇంటికి నిస్సంకోచంగా రావచ్చు. బిడ్డల్ని క్షమించే శక్తి తండ్రులకెప్పుడూ వుంటుంది. బై. అతను విసురుగా వెళ్ళిపోయాడు. శ్రోతల్ని విభ్రాంతిలో ముంచుతూ వెళ్ళిపోయాడు

* * * *

ఈ తాజా వార్తను విన్న నేను నా స్నేహబృందానికి చెప్పి నప్పుడు అందరూ ఏకకంఠంతో డాక్టర్ మూర్తి చేసింది చాలా తప్ప న్నారు.

పెళ్ళికాని కూతుర్ని ముఖ్యంగా తన స్వార్థం చూసుకుని వదిలి వెళ్ళిపోవడం దురన్యాయమన్నారు.

రోజులు చెడిపోతున్నాయన్నారు. అలాంటివాళ్ళని సంఘాలనుండి వెలివేయాలన్నారు.

మనస్ఫూర్తిగా అతను చేసిన పనిని విమర్శించారు.

ఈరోజు లోకేష్ చేసిన పనిని హర్షిస్తున్నారు.

లోకేష్ చేసింది, డాక్టర్ మూర్తి చేసింది ఒక్కటే. ఇద్దరూ తను కోరుకున్న తోడు కొరకు ఇల్లు వదిలేసారు.

డాక్టర్ మూర్తి పెళ్ళికాని కూతుర్ని ఇంట్లో వదిలి వెళ్ళడం అంత ఘోరమైన పనయితే జబ్బు తండ్రిని ఒంటరిగా వదలి వెళ్ళడం లోకేష్‌ది ఘోరాతి ఘోరం అవుతుంది.

లోకేష్ తండ్రికి ఇక జీవితంలేదు. మరో వసంతం అతని జీవితంలోకి రాదు. ఈనాడు డాక్టర్ మూర్తి వెళ్ళిపోయినా మధూలికకు, సాయికి యిద్దరికీ ముందు జీవితముంది.

తండ్రిని, తండ్రి చేసిన అన్యాయాన్ని మర్చిపోయి ముందుకు పోవడానికి మార్గముంది కానీ లోకేష్ తండ్రికి ఏం మిగిలింది?

స్వభావసిద్ధంగా ఎవర్నీ ఖండించలేని నేను నిశ్శబ్దంగా లేచి వచ్చేసాను-నాకేగాని శక్తి వుంటే ఈ సాంఘిక చట్టాన్ని మార్చేయాలని అనుకుంటూ.

*